సొంతగూటికి ఉద్యోగులు!

గ్రామపాలనాధికారులుగా వెళ్లిన వార్డు అధికారులు

- మున్సిపాలిటీలో మళ్లీ తగ్గిన ఉద్యోగుల సంఖ్య
- ఇమడలేక.. ఇబ్బందులు పడలేక...
- బ్యాక్ టూ పెవిలియన్ అన్న 14 మంది



శంషాబాద్ మున్సిపాలిటీ కార్యాలయం

శంషాబాద్: రెవిన్యూ నుంచి మున్సిపాలిటీకి వచ్చిన 14 మంది ఉద్యోగులు తిరిగి తమ సొంతగూటికి చేరుకున్నారు. గత ప్రభుత్వం, వీఆర్‌వో, వీఆర్‌ఏ వ్యవస్థను రద్దు చేయడంతో సంబంధిత ఉద్యోగులను మున్సిపాలిటీలోని విభాగాల్లో సర్దుబాటు చేసిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా రెవిన్యూ విభాగం నుంచి శంషాబాద్ మున్సిపాలిటీ కార్యాలయంలో మొత్తం 17 మంది ఉద్యోగులు రాగా వారు జూనియర్ అసిస్టెంట్ స్థాయి హోదాలో చేరారు. ఇందులో కొందరు వార్డు ఆఫీసర్‌లుగా మరికొందరు ఇతర విభాగాల్లో పనిచేశారు. ఇటీవల ప్రభుత్వం వీఆర్‌ఏ, వీర్‌వోలకు రెవిన్యూ శాఖలో గ్రామపాలన అధికారులుగా చేర్చుకోడానికి అవకాశం కల్పించడంతో 17 మందిలో 14 మంది సొంతగూటికి చేరుకోడానికే ఇష్టపడ్డారు. ఇటీవల నియామకపత్రాలు అందుకున్న సదరు ఉద్యోగులు రెవిన్యూ శాఖలో చేరిపోయారు. దీంతో మున్సిపాలిటీ ఒక్కసారిగా 14 మంది ప్రభుత్వాధికారులు తగ్గిపోయారు.

పదోన్నతిని సైతం వదులుకుని

వీఆర్‌వో నుంచి మున్సిపాలిటీలోని టౌన్‌ప్లానింగ్‌లోకి వచ్చిన ఓ అధికారి ఇక్కడే జూనియర్ అసిస్టెంట్ హోదా నుంచి సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతిని పొందారు. పదోన్నతిని తగ్గినా సరే కానీ తాను మున్సిపాలిటీలో పనిచేయడం ససేమిరా అని సదరు ఉద్యోగి ఇటీవల ప్రభుత్వం కల్పించిన ఆప్షన్‌లో పదోన్నతిని సైతం వదులుకుని జూనియర్ అసిస్టెంట్ హోదా కదలిగిన గ్రామ పాలనాధికారి పోస్టులో చేరిపోయిన తీరే ఇక్కడ ఉన్న పరిస్థితి ప్రత్యక్ష నిదర్శనంగా చెప్పొచ్చు. పంచాయతీ కాలంనుంచి ఉన్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులతో పాటు గత పాలకవర్గం కొందరు ప్రజాప్రతినిధులు ఇష్టారాజ్యంగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను నింపేసుకున్న తీరుపై కూడా స్థానికంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అవినీతి కార్యకలాపాలకు కేరాఫ్‌గా మారుతున్న వీరిని నియంత్రించడంపై ఉన్నతాధికారులు కనీసం దృష్టిసారించకుండా తాత్సారం చేస్తున్నారనే పట్టణ ప్రజాగ్రహం వ్యక్తం అవుతోంది.

ఎందుకు ఇలా..?

రెవిన్యూ విభాగం నుంచి మున్సిపాలిటీకి వచ్చిన అధికారులు ఎవరు కూడా మున్సిపాలిటీ కార్యాలయంలో ఉన్న విధుల్లో దాదాపుగా ఇమడలేకపోయారు. మున్సిపాలిటీ ఏళ్లుగా పాతుకుపోయిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులే వీరిపై ఆధిపత్యం చూపిన తీరు పలుమార్లు మున్సిపాలిటీలో చర్చనీయాశంగా మారాయి. కొందరు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు వార్డు అధికారులకు సహాయకులుగా ఉండి పనిచేయాల్సిన చోట తమపై అధికారులు నచ్చకపోతే వారినే మరో వార్డుకు మార్పించిన సంఘటనలు సాధారంగా మారిపోయాయి. శంషాబాద్ మున్సిపాలిటీ ఆది నుంచి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు రెవిన్యూ, టౌన్‌ప్లానింగ్, శానిటేషన్, ఇంజనీరింగ్ ఇలా ప్రతి విభాగంలో తమ ఆధిపత్యాన్ని కొనసాగిస్తున్నారు. గతంలో ఓ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి ఏకంగా కమిషనర్ డిజిటల్ సంతకాన్ని సైతం ఫోర్జరీ చేసిన తీరు కలకలం రేపింది. రెవిన్యూ సంబంధిత విభాగాల్లో భారీ అవినీతి, అవకతవకలపై పలుమార్లు సర్వసభ్య సమావేశాల్లో వీరి తీరు చర్చనీయాశంగా మారాయి. అయినా కొందరి అండదండలతో మున్సిపాలిటీలో వీరు ఆడిందే ఆట పాడిందే పాట అనే చందంగా మారింది.

తహసీల్దార్ కార్యాలయం ముట్టడి


తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

శంషాబాద్: వృద్ధులు, వికలాంగుల పెన్షన్‌లు పెంచాలంటూ ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు వృద్ధులు, వికలాంగులు పెన్షన్‌లు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ రవీందర్‌దత్‌కు వినతి పత్రం సమర్పించారు. ఎంఆర్‌పీఎస్ నాయకులు కొత్తూరు రమేష్ మాదిగ, చిన్నగండు భాస్కర్, వీహెచ్‌పీఎస్ నాయకులు హన్మంతురెడ్డి, కొండా రాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆరోగ్య సంరక్షణపై శ్రద్ధ చూపాలి


పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

శంషాబాద్: శంషాబాద్ పట్టణంలోని సాతంరాయిలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల డిగ్రీ (పురుషులు) కళాశాలలో సోమవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ప్రభుత్వాసుపత్రి వైద్యులు అనూప్ విద్యార్థుల ఆరోగ్యాన్ని పరీక్షించి వారికి పలు సూచనలు చేశారు. విద్యార్థులందరు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలన్నారు. పరిశుభ్రత చర్యలు అత్యంతముఖ్యమైందని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ షహనా నజ్నీన్, వైస్ ప్రిన్సిపాల్ నరేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంజనీర్లు అభివృద్ధి ప్రదాతలు

వాసవి కపుల్స్ క్లబ్ అధ్యక్షుడు వంశీకృష్ణ


డీఈ సంజయ్‌ని సన్మానిస్తున్న క్లబ్ నాయకులు

మణికొండ: సమాజానికి అధునాతన పరికరాలు, రోడ్లు, వంతెనలను అందించి అభివృద్ధి ప్రదాతలుగా నిలుస్తున్నారని మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని వాసవి కపుల్స్ క్లబ్ అధ్యక్షుడు వంశీకృష్ణ అన్నారు. సోమవారం ఇంజనీర్స్ డే సందర్భంగా మణికొండ మున్సిపాలిటీ డీఈ సంజయ్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మనకు అనేక సౌకర్యాలను కల్పిస్తున్న ఇంజనీర్లను ఆదరించాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. కార్యదర్శి జగదీశ్వర్, కోశాధికారి శిరీష, జిల్లా ప్రోగ్రాం అధికారి నాగరాజులు పాల్గొన్నారు.

సాయికృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గం


కార్యవర్గ సభ్యులు

రాజేంద్రనగర్: బుద్వేల్‌లోని సాయికృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలను సోమవారం నిర్వహించారు. నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బి.శ్రీనివాస, ఉపాధ్యక్షుడిగా ఎస్.నాగేశ్వర్ రావు, జనరల్ సెక్రటరీలుగా ఎస్.శ్రీనివాస్ రెడ్డి, ఎన్.రమేశ్ యాదవ్, జాయింట్ సెక్రటరీలుగా కె.అంజయ్య, అనీఫ్, ట్రెజరర్‌గా అశోక్, లేడీస్ రిప్రజెంటేటివ్‌గా వై.ప్రమీల, సలహాదారులుగా పి.భూపాల్ రెడ్డి, ఎస్.రంగస్వామి, కోటేశ్వరరావులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు శ్రీనివాస మాట్లాడుతూ... కొత్తగా ఏర్పడిన కమిటీ సభ్యుల సహాయ సహకారంతో కాలనీని ప్రగతి పథంలో తీసుకెళ్లడానికి కృషి చేస్తామన్నారు.

రేపు రక్తదాన శిబిరం

రాజేంద్రనగర్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని రాజేంద్రనగర్ డివిజన్ ఆధ్వర్యంలో ఈ నెల 17వ తేదీన రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు బీజేపీ డివిజన్ అధ్యక్షుడు సందీప్ ముదిరాజ్ తెలిపారు. ఉప్పర్‌పల్లిలోని పీఆర్ ప్యాలెస్‌లో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. రక్తదానం చేయాలనుకునే వారు ఫోన్: 99483 12244లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. రక్తదాన శిబిరంతో పాటు పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కార్యక్రమానికి పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

పార్టీ మారి ప్రయోజనమేంది?

- మెట్రో సాధనకు త్వరలో పోరాటం
- బీఆర్ఎస్ పార్టీ రాజేంద్రనగర్ ఇంచార్జి కార్తీక్‌రెడ్డి


నార్సింగిలో మాట్లాడుతున్న కార్తీక్‌రెడ్డి

మణికొండ: నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ప్రకాశ్‌గౌడ్ కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లి సాధించిందేమిటో ప్రజలకు చెప్పాలని... ఎమ్మెల్యే ముందే సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గంలో గతంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని అన్నా మిన్నకున్నారంటే అతను గతంలో సాధించిన అభివృద్ధి, వాటిపై వేసిన కరపత్రాలు అబద్ధమా అని బీఆర్ఎస్ పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇంచార్జి పి.కార్తీక్‌రెడ్డి ప్రశ్నించారు. సోమవారం ఆయన బీఆర్ఎస్ పార్టీ నార్సింగి మున్సిపాలిటీ అధ్యక్షుడు కె.విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా కార్తీక్‌రెడ్డి మాట్లాడుతూ... నియోజకవర్గంలోని మణికొండ, నార్సింగి, బండ్లగూడ మీదుగా శంషాబాద్‌కు వచ్చే మెట్రో రైల్ ప్రాజెక్టు ఎమ్మెల్యే పార్టీ మారటంతో కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. ఎలాంటి నిర్మాణాలు లేని ఫోర్త్ సిటీకి మెట్రో వేస్తామన్న ముఖ్యమంత్రి, ఆకాశాన్ని తాకే టవర్‌లు ఉన్న రాజేంద్రనగర్ నియోజకవర్గానికి ఎందుకు రద్దు చేశారో చెప్పాలన్నారు. మెట్రో సాధనకు త్వరలోనే పెద్ద ఎత్తున తమ పార్టీ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామన్నారు. గండిపేట, హిమాయత్ సాగర్‌లకు గోదావరి జలాల తరలింపు పథకంలో పెద్ద ఎత్తున అవినీతి ఉందన్నారు. హైడ్రా పేరుతో పెద్దలను బెదిరించి డబ్బులు లాగటం, పేదల పొట్ట కొట్టడం తప్ప ప్రజలకు కలుగుతున్న ప్రయోజనం లేదని విమర్శించారు.

☛ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ కాంగ్రెస్ పార్టీలో చేరినా ఆ పార్టీ వారు తమ పార్టీలో చేరలేదని అంటున్నారని, బీఆర్ఎస్ పార్టీకి అతను పనిచేయటం లేదని, మరి ఏ పార్టీలో ఉన్నారో ఆయనను గెలిపించిన 6 లక్షల మంది ఓటర్లకు చెప్పాలని కార్తీక్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆయన పార్టీ మారటంతో నియోజకవర్గ ప్రజలకు మూసీ సుందరీకరణ, 111 జీవోకు బదులుగా తెచ్చిన జీవో 69 అమలు కాకపోవటం, మూసీ సుందరీకరణ పేరుతో పేదల గృహాలు కూల్చటం లాంటి నష్టాలే జరుగుతున్నాయన్నారు. బీఆర్ఎస్ నాయకులు నిజాముద్దీన్, రాజ్‌కుమార్, వరదాచారి, శ్రీకాంత్‌రెడ్డి, ముత్యాలు, విష్ణువర్ధన్, ముస్తఫా, ఆనంద్, మహేష్, నర్సింహ, ప్రియదర్శిని, జయమ్మ, మల్లేష్ పాల్గొన్నారు.


ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న వట్టినాగులపల్లి వాసులు

సమస్యలు పరిష్కరించండి

మణికొండ: వట్టినాగులపల్లిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని వట్టినాగులపల్లి గ్రామస్థులు ఎమ్మెల్యే టి. ప్రకాశ్‌గౌడ్‌ను కోరారు. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని వట్టినాగులపల్లి గ్రామంలో ప్రధాన రోడ్డు పూర్తిగా గోతుల మయంగా మారి ఇబ్బందులు పడుతున్నామన్నారు. రేడియల్ రోడ్డు పనులు పూర్తి కాకపోవటం, మరమ్మతులు చేపట్టకపోవటంతో నరకయాతన అనుభవిస్తున్నామని పేర్కొన్నారు. హెచ్‌సీయూ డిపో నుంచి వట్టినాగులపల్లి మీదుగా నార్సింగి వరకు ఆర్‌టీసీ బస్సులు నడిపేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామానికి మంజీరా నీటి సరఫరా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కొత్తగా పైప్‌లైన్ వేసి సరిపడ నీటిని సరఫరా చేయించాలన్నారు. స్పందించిన ఎమ్మెల్యే త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని గ్రామస్థులు తెలిపారు. మాజీ ఎంపీటీసీ సభ్యుడు జి.నగేష్‌యాదవ్, మాజీ వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రమాదాలను నివారించండి


మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

మణికొండ: పుప్పాలగూడ సంతోష్‌నగర్ కాలనీ ప్రధాన రోడ్డుపై ఇటీవల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, స్పీడ్ బ్రేకర్‌లను ఏర్పాటు చేసి వాటిని నివారించాలని కాలనీ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ నాయకులు మణికొండ మున్సిపల్ కమిషనర్‌ను కోరారు. సోమవారం ఆయనను మున్సిపల్ కార్యాలయంలో కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు ఎస్.సురేందర్ మాట్లాడుతూ... ప్రధాన రోడ్డుపై సూపర్‌మార్కెట్‌లు, బస్‌స్టాప్, ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయని, అక్కడ తరచు రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అక్కడ స్పీడ్ బ్రేకర్‌లు ఏర్పాటు చేస్తే వాహనాల వేగం తగ్గి ప్రమాదాలను నివారించవచ్చన్నారు. త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని కమిషనర్ హామీ ఇచ్చారని తెలిపారు. ఉపాధ్యక్షుడు ఎస్.యాదయ్య, కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్.బాబురావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో నాలుగు ఫిర్యాదులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి నాలుగు ఫిర్యాదులు అందాయని ఉప కమిషనర్ సురేందర్ రెడ్డి తెలిపారు. అక్రమ కట్టడాలకు సంబంధించి రెండు, రోడ్లు, పారిశుద్ధ్యంపై ఒక్కో ఫిర్యాదు ప్రకారం అందాయన్నారు. సంబంధిత ఫిర్యాదులను అధికారులకు అందజేసినట్లు వెల్లడించారు. క్షేత్రస్థాయిలో పర్యటించి తగు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ప్రజావాణి కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీలోని అన్ని విభాగాల అధికారులు పాల్గొంటారన్నారు. సమస్యల పరిష్కారం కోసం ప్రజలు ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఈవెంట్లు, గేమ్స్ నిర్వహణకు బుకింగ్ షురూ

రాజేంద్రనగర్: కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను ఈవెంట్లు, గేమ్స్ నిర్వహించుకునేందుకు అద్దె ప్రతిపాదికన ఆన్‌లైన్ బుకింగ్‌ను ప్రారంభించినట్లు రాజేంద్రనగర్ సర్కిల్ ఉప కమిషనర్ సురేందర్ రెడ్డి తెలిపారు. స్కూల్ విద్యార్థులు, ఇంటర్, డిగ్రీ, యూనివర్సిటీ విద్యార్థులు నిర్వహించుకునే ఈవెంట్లు, బ్యాండ్మింటన్, క్యారమ్స్, హ్యాండ్‌బాల్, వాలీబాల్, స్కేటింగ్, స్విమ్మింగ్ తదితర క్రీడలు నిర్వహించుకునేందుకు స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఎంతో అనువుగా ఉందన్నారు. రెండు, మూడు రోజుల పాటు నిర్వహించుకునేందుకు ఆన్‌లైన్ బుకింగ్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. విద్యార్థులు ఏర్పాటు చేసే ఎగ్జిబిషన్లకు ఇది ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. స్పోర్ట్స్ నిర్వహించుకునే పాఠశాలలు, యూనివర్సిటీ, డిగ్రీ, జూనియర్ కళాశాలలకు ఇది మంచి అవకాశమన్నారు. ఆన్‌లైన్ ద్వారా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను బుక్ చేసుకోవాలన్నారు. మరింత సమాచారం కోసం స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఇన్‌చార్జిలు ఎం.శ్రీకాంత్‌ను ఫోన్: 90328 22951లో, ఇక్బాల్ అలీని ఫోన్: 98852 04787లో సంప్రదించాలన్నారు.

సంబంధం లేని వారిపై కేసు తగదు: బీఆర్ఎస్

మణికొండ: రాజకీయ కక్షలతో మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని వెంకటేశ్వర కాలనీ సర్వసభ్య సమావేశంలో జరిగిన గొడవకు సంబంధం లేని వారిపై నార్సింగి పోలీసులు కేసు నమోదు చేశారని, మరో మారు విచారణ చేపట్టి న్యాయం చేయాలని బీఆర్ఎస్ పార్టీ నాయకులు సైబరాబాద్ పోలీస్ కమిషనర్‌ను కోరారు. సోమవారం ఆయనను కలిసి ఈ మేరకు వినతిపత్రం ఇచ్చినట్టు బీఆర్ఎస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు డి.సీతారాం ఒక ప్రకటనలో తెలిపారు. గొడవకు అసలు కారకులను వదిలి అన్యాయంగా బీఆర్ఎస్ పార్టీ నాయకులైన ఉపేంద్రనాథ్ రెడ్డి, షేక్ ఆరీఫ్, విశ్వనాథ్, కోటేశ్వర్‌లపై కేసు పెట్టారన్నారు. మున్సిపాలిటీ పరిధిలో అక్రమ నిర్మాణాలు, ప్రభుత్వ స్థలాల కబ్జా, మున్సిపాలిటీలో ఐదు సంవత్సరాలలో జరిగిన అవినీతిపై వారు ఉన్నతాధికారులు, హైడ్రాకు ఫిర్యాదులు చేయటంతోనే వారిపై కక్షకట్టి కేసు పెట్టించారన్నారు. అక్రమంగా పెట్టిన కేసుపై మరో సారి విచారణ చేసి న్యాయం చేయాలని పోలీస్ కమిషనర్‌ను కోరామన్నారు.

వివిధ అంశాలపై విద్యార్థినులకు అవగాహన


అవగాన కార్యక్రమంలో జిమ్స్ వైద్య బృందం

శంషాబాద్ రూరల్: పెద్దగోల్కొండ ప్రాథమికోన్నత పాఠశాలలో బాలికల్లో పెరుగుతున్న పాలిసిస్టిక్ ఓవరీ సింద్రోమ్ (పీసీఓఎస్) సమస్యపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. జిమ్స్ వైద్య కళాశాల, ఆస్పత్రి ఆధ్వర్యంలో సోమవారం పాఠశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గైనకాలజిస్ట్ డాక్టర్ ఐ.మానస పలు అంశాలకు వివరించారు. కౌమార దశలో బాలికలకు పీసీఓఎస్ లక్షణాలు, కారణాలు, నివారణ పద్ధతులపై అవగాహన కల్పించారు. ఆరోగ్యకరమైన జీవనశైలి ప్రాముఖ్యాన్ని వివరించారు. సరైన ఆహారపు అలవాట్లు, క్రమమైన వ్యాయామం, మానసిక ఒత్తిడిని తగ్గించే మార్గాలు, ఆరోగ్య పరీక్షల అవసరం గురించి విద్యార్థినిలకు తెలియజేశారు. జిమ్స్ వైద్యులు డాక్టర్ విజయశ్రీ, హారిక, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లావణ్య తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక చర్యలు

ఉప కమిషనర్ సురేందర్‌రెడ్డి


పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న డీసీ సురేందర్‌రెడ్డి

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఉప కమిషనర్ సురేందర్ రెడ్డి తెలిపారు. నిత్యం సర్కిల్ పరిధిలోని ఐదు డివిజన్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. సోమవారం ఆయన ఉప్పర్‌పల్లి, కిషన్మగుట్ట, బుద్వేల్, ఆరాంఘర్, కాటేదాన్, మైలార్‌దేవ్‌పల్లి, శాస్త్రిపురం, సులేమాన్‌నగర్‌లలో చేపడుతున్న పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ... ప్రజలు తమ ఇళ్లల్లోని తడి, పొడి చెత్తను వేర్వేరుగా చేసి ఇంటి వద్దకు వచ్చే ఆటోరిక్షా కార్మికులకు అందించాలన్నారు. రోడ్లు, ఖాళీ ప్రదేశాల్లో చెత్తను వేయవద్దన్నారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తూ తమ సిబ్బందికి చిక్కితే అపరాధ రుసుం వేస్తామన్నారు. ఐదు డివిజన్ల పరిధిలో 86 గ్రూపులు పారిశుద్ధ్య పనులను చేపడుతున్నాయన్నారు. 602 మంది కార్మికులు విధులకు హాజరవుతున్నారన్నారు. పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించేందుకు 36 మంది ఎస్‌ఎఫ్‌ఏలు, నలుగురు జవాన్లు, నలుగురు ఎస్‌ఎస్ విధుల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు. రోడ్లతో పాటు ఓపెన్ పాయింట్లలో చెత్త వేస్తున్న వారిని గుర్తించి వారికి జరిమానాలు విధిస్తామని డీసీ హెచ్చరించారు.

అభివృద్ధి నిరంతర ప్రక్రియ

- రూ. 8.83 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తాం
- రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

బండ్లగూడ: అభివృద్ధి నిరంతర ప్రక్రియ అని... రాజేంద్రనగర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు చిత్తశుద్ధితో ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ అన్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సోమవారం రూ. 8.83 కోట్ల నిధులతో 1, 7, 8, 10, 14, 18, 21వ డివిజన్‌లలో బీటీ రోడ్డు, సీసీ రోడ్డు విస్తరణ పనులు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకుగాను కమిషనర్ శరత్‌చంద్రతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రజల సమస్యలను పరిష్కరించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. గతంలో బండ్లగూడ జాగీర్‌లో సీసీ రోడ్డులు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు లేక ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారు. ఇప్పుడు కాలనీలలో సీసీ రోడ్డులు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ అభివృద్ధికి తమ వంతు కృషి ఉంటుందని, భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టి బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ రూపురేఖలు మారుస్తామన్నారు. పీఏసీఎస్ చైర్మన్ రాందాస్ ముదిరాజ్, డీఈ యాదయ్య సాగర్‌గౌడ్, పూలపల్లి రాజేందర్‌రెడ్డి, సురేష్‌గౌడ్, మహేందర్‌గౌడ్, గోకరి శ్రీలత, కృష్ణారెడ్డి, ఖాజపాషా, హరీశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన 'ఫ్యామిలీ వెల్‌నెస్ సమ్మిట్'


కార్యక్రమలో పాల్గొన్న నిర్వాహకులు

శేరిలింగంపల్లి: నల్లగండ్లలో హోలిస్టిక్ కేర్ ఫ్యామిలీ వెల్నెస్ సమ్మిట్ ఘనంగా సోమవారం ముగిసింది. పోషకాహార మూమెంట్, మైండ్‌ఫుల్‌నెస్ భావోద్వేగ అభ్యాస అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. డబ్ల్యూఐసీసీఐ హోలిస్టిక్ చైల్డ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ ఆధ్వర్యంలో నల్లగండ్లలోని ఎక్స్‌ట్రామైల్ ప్రీ స్కూల్ అండ్ ఎన్‌రిచ్‌మెంట్ సెంటర్‌లో కార్యక్రమం కొనసాగింది. పలువురు కుటుంబ, పిల్లల అభివృద్ధి నిపుణులు, కమ్యూనిటీ సంస్థలు, పోషకాహారం, మూమెంట్, మైండ్‌ఫుల్‌నెస్, భావోద్వేగ అభ్యాస అంశాలపై ఆచరణాత్మకమైన అంశాలతో పలు సెషన్‌లను నిర్వహించారు. కిమ్స్ కడల్స్ పీడియాట్రిక్స్, క్రిటికల్ కేర్ స్పెషలిస్ట్ చీఫ్ డాక్టర్ నితిన్ చావ్లా, ఎమర్జెన్సీ మెడిసిన్ స్పెషలిస్ట్, డాక్టర్ అంకిత ఆర్ చావ్లా, రెయిన్‌బో చిల్డ్రన్స్ ఆస్పత్రి కన్సల్టెంట్ పీడియాట్రీషియన్ డాక్టర్ పల్లవి మద్దకూరి పాల్గొని పలు అంశాలను వివరించారు. అనంతరం స్టార్‌లైట్ న్యూట్రీషియన్ వ్యవస్థాపకురాలు అంజలిడాంగే, ప్రాజెక్ట్ సీ ఫౌండేషన్ సీఈఓ వ్యవస్థాపకురాలు దేవాషిస్‌జెనా, నమ్రతాసాధ్వాని ప్యానల్ చర్చా కార్యక్రమంలో పాల్గొన్నారు. పిల్లల కార్యక్రమంలో నూపుర్ అగర్వాల్ కథ చెప్పడం, స్ప్రింగ్‌అప్ లీడర్‌షిప్ ద్వారా ఎస్‌ఈఎల్ సెషన్, థింక్‌లెబడ్స్ ద్వారా జర్నలింగ్ వర్క్‌షాప్ జరిగింది. రష్మి శ్రీవాస్తవ ఆధ్వర్యంలో జుంబా ఎనర్జైజర్ పాయల్ జైన్ ఆధ్వర్యంలో ఫ్యామిలీ వెల్నెస్ మాస్టర్ క్లాస్ షెడ్యూల్‌ను పూర్తి చేశారు. డబ్ల్యూఐసీసీఐ హోలిస్టిక్ చైల్డ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ జాతీయ అధ్యక్షురాలు అనుపమ దాల్మియా, రాష్ట్ర అధ్యక్షురాలు హర్షితా సక్సేనా శ్రీవాస్తవ పర్యవేక్షించారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని వినతి

మైలార్‌దేవ్‌పల్లి: అంగన్‌వాడీ టీచర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ రంగారెడ్డి ఉపాధ్యక్షుడు జాజాల రుద్రకుమార్ కోరారు. ఈ మేరకు సోమవారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్‌కు వినతి పత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడతూ... అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యేకు వివరించామన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టినట్లుగా రూ. 18 వేల వేతనం, పీఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. రిటైర్‌మెంట్ అయిన వాళ్లకు జీవో నెం 8ను సవరణ చేయాలని కోరారు. ఇలా తాము ఎదుర్కొంటున్న పలు సమస్యలు, తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. సీఐటీయూ జిల్లా నాయకులు పి.సి.కె.భాస్కర్, ఎన్.జంగయ్య, అంగన్‌వాడీ టీచర్స్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు అనిత, సెమెన్ బేగమ్, మాధవి, సుమలత, జ్యోతి, శోభారాణి, సబిత, విమల, నవనీత, మంజుల, రాధ తదితరులు పాల్గొన్నారు.

సీబీఐటీలో ఘనంగా ఇంజనీర్స్ డే


ఇంజనీర్స్ డేలో పాల్గొన్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

మణికొండ: భారతరత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీబీఐటీ) కళాశాలలో జాతీయ ఇంజనీర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సివిల్ ఇంజనీరింగ్, ఐఈఐ స్టూడెంట్ చాప్టర్, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్ ఇంజనీరింగ్‌ల విభాగంలో జరిగిన కార్యక్రమంలో సత్యవాణి ప్రాజెక్ట్స్, కన్సల్టెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఫౌండర్ డైరెక్టర్ పి.సూర్యప్రకాశ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వికసిత్ భారత్ 2047 కోసం ఇంజనీర్లు అనే అంశంపై మాట్లాడారు. ప్రిన్సిపాల్ సీవీ నరసింహులు దేశ నిర్మాణంలో ఇంజనీర్ల పాత్ర, సృజనాత్మకత, అభివృద్ధి గురించి మాట్లాడారు. సివిల్ హెచ్‌ఓడీ జగన్నాథరావు, ఈసీఈ హెచ్‌ఓడీ డాక్టర్ కె.వసంత్, కన్వీనర్, ఫ్యాకల్టీ కో ఆర్డినేటర్ డాక్టర్ జ్ఞానరంజన్, ఫ్యాకల్టీ అడ్వైజర్ డాక్టర్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.